

14న గిరిజన రైతులకు పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని కొండగంగుపూడి పంచాయతీ పరిధిలోని కేజీ పూడి ఎస్‌టికాలనీ, చిట్టివాణిపాలెం, సారవనిపాలెం, కోటయ్య గురువు, సొంటివాణిపాలెం, సంఘంవలస, బంధవలస, గిరిజన రైతులకు ఈ నెల 14న పట్టాలు పంపిణీ చేస్తారని సిపిఎం నాయకులు చల్లా జగన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పట్టాలు కోసం గిరిజన రైతులతో పాటు సిపిఎం నాయకులు గత మూడు నెలలుగా అలుపెరుగని పోరాటం చేశారన్నారు. దీంతో స్పందించిన ప్రభుత్వం వారికి పట్టాలిచ్చేందుకు అంగీకరించినట్లు స్వయంగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు చెప్పారని తెలిపారు. ఎస్‌కోటలో ఈ పట్టాలు పంపిణీ కార్యక్రమానికి రైతులంతా హాజరు కావాలని కోరారు.

ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా

రూ. కోట్లు విలువ చేసే స్థలంపై అక్రమార్కుల కన్ను

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలో ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేసేస్తున్నారు. నిన్నటి వరకు ఇందిరమ్మ కాలనీ, అమ్మిగారి కోనేరుగట్టు స్థలాలను అక్రమించేసి కొంతమంది అక్రమార్కులు సొమ్ము చేసుకోగా నేడు ఐటిఐ కాలనీ సమీపంలో జగనన్న కాలనీ వద్ద స్థలంపై అక్రమార్కులు కన్నుపడింది. రూ. కోట్లు విలువ చేసే ఈ స్థలాన్ని చదును చేసి ఆక్రమణకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి.

గతంలో అమ్మిగారి కోనేరుగట్టుపై అధికార పార్టీకి చెందిన నేతలు అండదండలతో స్థలాలను అక్రమించేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. కోనేరుగట్టుపై అక్రమ నిర్మాణాలను ఆపాలని గతంలో పని చేసిన ఆర్‌డిఒ పి.శేషశైలజ ఆదేశించినప్పటికి అధికార పార్టీ నేతల అండదండలు ఉండడంతో అక్రమ నిర్మాణాలకు అధికారులు అడ్డుకట్ట వేయలేకపోయారు. ఇందిరమ్మ కాలనీలో కూడా ఖాళీ స్థలాలు అధికార పార్టీ నేతల అండదండలతో ఆక్రమణలు జరుగుతున్నాయి. ఒక విఆర్‌ఓ సహాయంతో ఆక్రమణ స్థలాలకు నకిలీ పట్టాలు తయారు చేసి అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు రావడంతో తహశీల్దార్ డోల రాజేశ్వరరావు నాలుగు బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేశారు. దర్యాప్తులో నకిలీ పట్టాలు, స్థలాల ఆక్రమణ బయటపడడంతో దర్యాప్తు ఆపాలని అధికారులపై అధికార పార్టీ నేతలు ఒత్తిడి చేయడంతో అర్ధాంతరంగా దర్యాప్తు నిలిపివేశారు. దీంతో ఆక్రమణదారులు ప్రభుత్వ స్థలాలను అక్రమించేసి ఒకొక్క స్థలాన్ని రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి.



ఆక్రమణకు గురవుతున్న భూమి

నేడు జగనన్న కాలనీ వద్ద ఆక్రమణలు

తాజాగా ఐటిఐ కాలనీ సమీపంలో ప్రభుత్వం నూతనంగా వేసిన జగనన్న కాలనీ లేఅవుట్ వద్ద ఖాళీ స్థలంపై అక్రమార్కులు కన్ను పడింది. ఉర్దూ పాఠశాల ప్రహరీ గోడకు అనుసరించి ఉన్న ఖాళీ స్థలాన్ని అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు చదును చేసి అక్రమించేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇక్కడ స్థలం చదరపు గజం రూ.10వేలు వరకు ధర పలుకుతుంది. సుమారు 1500 చదరపు గజాలు విస్తీర్ణం ఉన్న ఈ స్థలాన్ని కొందరు అక్రమించేందుకు స్థలాన్ని చదును చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వ స్థలాన్ని అక్రమిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, వామపక్ష నేతలు డిమాండ్ చేస్తున్నారు.

జమ్మయ్యపేటకు కొత్త రహదారి

- నిర్మాణానికి భూసేకరణ
- విమానాశ్రయం నిర్మాణంలో కనుమరుగు కానున్న పాత రహదారి

ప్రజాశక్తి-భోగాపురం

విమానాశ్రయ నిర్మాణంలో సవరవల్లి నుంచి సన్‌రే వై జంక్షను మీదుగా జమ్మయ్యపేట గ్రామానికి వెళ్లే రహదారి కనుమరుగు కానుంది. దీంతో ఈ రహదారి నుంచి వెళ్లే సుమారు ఐదు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోనున్నాయి. ఈ నేపథ్యంలో ఈ గ్రామాలకు కొత్త రహదారిని వేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం కొత్తగా భూసేకరణ చేసేందుకు రెవెన్యూ అధికారులు సిద్ధమవుతున్నారు.

భోగాపురం అంతర్జాతీయ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా విమానాశ్రయం భూములు చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణ పనులు కూడా చురుకుగా సాగుతున్నాయి. సవరవల్లి వద్ద జాతీయరహదారి నుంచి జమ్మయ్యపేట వెళ్లే రహదారి విమానాశ్రయం భూముల మధ్యలో ఉంది. ఈ రహదారి మీదుగా రన్‌వే నిర్మించనున్నారు. ఈ రహదారి తొలగిస్తే జమ్మయ్యపేట, కవులవాడ, పెద కవులవాడ, తూడెం, బసవపాలెం గ్రామాలకు వెళ్లేందుకు ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడనున్నారు. సవరవల్లి నుంచి రావాడ మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది.

విమానాశ్రయ ప్రహరీగోడ పక్కనుంచే కొత్త రహదారి

గతంలో జమ్మయ్యపేట నుంచి రావాడ మీదుగా రహదారి నిర్మించాలని అధికారులు భావించారు. కాని ఏమైందో తెలియదు కాని మళ్లీ విమానాశ్రయం ప్రహరీ గోడ ప్రక్క నుంచి కొత్త రహదారిని వేయాలని నిర్ణయించారు. ఈ రహదారిని జమ్మయ్యపేట నుంచి ప్రహరీగోడ ప్రక్క నుంచి సన్‌రే వై జంక్షను వద్ద కలపనున్నారు. దీనికోసం అవసరమైన భూమిని సేకరించేందుకు సిద్ధమయ్యారు. సర్వే నెంబర్ల వారీగా ఎంత భూమి అవసరమో విఆర్‌ఒలు సర్వే చేశారు. రావాడ, కవులవాడ రెవెన్యూ గ్రామాల్లోని భూములు సేకరించనున్నారు.



కనుమరుగు కానున్న జమ్మయ్యపేట రహదారి

రహదారి నిర్మాణానికి భూసేకరణ చేస్తాం

విమానాశ్రయంలో జమ్మయ్యపేట వెళ్లే రహదారి కనుమరుగు కానుంది. అందుకు ఆ రహదారిలో ఉండే గ్రామ ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు విమానాశ్రయం ప్రహరీగోడ చుట్టూ కొత్త రహదారిని నిర్మించేందుకు నిర్ణయించారు. ఇందుకు అవసరమైన భూసేకరణ ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు చేయనున్నాం.

చింతాడ బంగార్రాజు,
తహశీల్దారు, భోగాపురం మండలం.

వికలాంగులకు కుట్టు మిషన్లు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో వైసిపి వికలాంగుల విభాగం, శ్రీ విజయదుర్గ వికలాంగుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జీవనోపాధి కోసం కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ఆధ్వర్యాన వీటిని అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కొండబాబు, విజయదుర్గా వికలాంగుల సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న డిప్యూటీ స్పీకర్, జెడ్‌పి చైర్మన్

జాతీయ మహిళా కబడ్డీ పోటీలకు ఇద్దరు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 11 నుంచి 15వరకు పంజాబ్ రాష్ట్రంలో జరుగనున్న జాతీయ మహిళా కబడ్డీ పోటీలకు జిల్లా నుంచి కె.రామలక్ష్మి, ఎం.భువన ఎంపికయ్యారు. గత నెలలో కర్నూలులో జరిగిన 70వ రాష్ట్రస్థాయి మహిళల అంతర్ జిల్లా సీనియర్ కబడ్డీ పోటీల్లో విజయనగరం జిల్లా ప్రథమ స్థానం సాధించింది. జట్టును ప్రథమ స్థానంలో నిలబెట్టిన క్రీడాకారులు కె. రామలక్ష్మి ఎం భువన జాతీయ జట్టుకు ఎంపికయ్యారు. వీరికి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంగారావు, ప్రభావతి అభినందనలు తెలిపారు.



రామలక్ష్మి, భువన

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు యుగంధర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నవంబర్ 26వ తేదీ నుండి 28 వరకు గుంటూరు జిల్లా నర్సరావుపేటలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఖో-ఖో పోటీలలో విజయనగరం బాలుర జట్టు తృతీయ స్థానం సాధించింది. విజయనగరం జిల్లా జట్టులో ఉత్తమ ప్రతిభ కనబరచిన డి. యుగంధర్ జాతీయ పోటీలకు పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు.



యుగంధర్ జొన్నవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వతరగతి చదువుతున్నాడు. ఈనెల 3 నుండి ప్రకాశం జిల్లా పంగులూరులో రాష్ట్ర జట్టుకు కోచింగ్ క్యాంపు నిర్వహించారు. డిసెంబర్ 13 నుంచి 17 వరకు కర్ణాటక రాష్ట్రం చిరుత్తురులో జరగబోయే జాతీయ స్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీలకు రాష్ట్రజట్టు బయలు దేరింది. యుగంధర్ ఎంపిక పట్ల జెడ్‌పిటిసి కెల్ల శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

టిడిపి నాయకులు కళా వెంకటరావు

ప్రజాశక్తి - విజయనగరం కోట

రాష్ట్రంలో వైఎస్‌ఆర్ ప్రభుత్వం రైతులను ఉక్కుపాదంతో తొక్కాలని చూస్తోందని టిడిపి సీనియర్ నాయకులు కిమిడి కళావెంకటరావు మండిపడ్డారు. తుపాను వల్ల నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30వేలు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఒక ప్రైవేటు హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుపాను కారణంగా రైతులకు చేతికొచ్చిన పంట చేరకుండా నీటి పాలైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం రైతులకు సకాలంలో నీరు ఇవ్వలేదు సరికదా, సాయం చేసేందుకు కూడా వెనుకాడుతోందని అన్నారు. తోటపల్లి, నాగావళి నదుల్లో 3 టిఎంసిల నీరు ఉన్నప్పటికీ రైతులకు సకాలంలో అందించలేకపోయారని తెలిపారు. తోటపల్లికి వస్తున్న నీరు రాకుండా అడ్డు కుంటున్న గడ్డిని తొలగించడానికి ఇంజనీర్లు రూ. 10 కోట్లు లేదా మూడు కోట్ల రూపాయలు అయినా ఇవ్వండి ఇవ్వాలని ఇచ్చిన వినతులను ప్రభుత్వము పట్టించుకోలేదని అన్నారు. ఇటు ఎమ్మెల్యేలు గానీ మంత్రులు గాని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పట్టించుకోలేదన్నారు. ఈ జిల్లాల్లో ఖరీఫ్ సీజన్లో రూ.2వేల కోట్ల విలువైన పంట పండుతుందని, కానీ, ప్రభుత్వం సకాలంలో నీరందించక నష్టపోతున్నారని అన్నారు. వర్షాభావంతో 75శాతం పంట పోతే, మిగతా 25శాతం తుపాను వల్ల పోయిందని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కళా వెంకటరావు

కేంద్ర ప్రభుత్వం బస్తాకు రూ.1600 ధర నిర్ణయిస్తే ఇక్కడ దళారులు రూ.800కే అడుగుతున్నారని ఆవేదన చెందారు. రైతులు రోడ్డెక్కుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. తుపానుతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 30 వేలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామినాయుడు, గజపతినగరం మాజీ ఎమ్మెల్యే కొండపల్లి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వాటర్ ప్లాంట్ సీజ్ చేయాల్సిందే

11 నుంచి 26 వరకు పోరాటాలు

పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి శంకరరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం ఒకటవ డివిజన్ పరిధిలోని అయ్యప్పనగర్ లో పూసర్ల మధు సూదన రావు అక్రమంగా స్వాతీ ప్యూర్‌ఫైర్ వాటర్ ప్లాంట్ ను నడుపుతున్నారని, వెంటనే ప్లాంట్‌ను సీజ్‌చేయాలని పట్టణపౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకర్రావు, అయ్యప్ప నగర్ పోరాట కన్వీనర్ యుఎస్ రవికుమార్ డిమాండ్ చేశారు. ఈప్లాంట్‌కు భూగర్భజల శాఖ అధికారులుగాని, మున్సిపల్ అధికారులుగాని, రెవెన్యూ అధికారులుగాని అనుమతులు ఇవ్వలేదని, అయినా అక్రమంగా నీటివ్యాపారం చేస్తూ ప్రభుత్వాన్ని మోసగిస్తున్నారని తెలిపారు. ఆదివారం స్థానిక ఎల్ బి జి భవనం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ అక్రమ ప్లాంట్ వల్ల అయ్యప్ప నగర్ లో ప్రజలు, సొంత ఇంటి దార్లు బోర్లు ఇంకిపోయి నీరు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అక్రమ వాటర్ ప్లాంట్ సీజ్ చేయాలని అయ్యప్ప నగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూన్ 6న ప్రజలు నిరసన తెలియ జేస్తే, ఆ కాలనీ అసోసియేషన్ కార్యదర్శి సుధీర్,నాయకులు యు ఎస్. రవి కుమార్, రెడ్డి శంకరరావుపై తప్పుడు ఎస్సీ,ఎస్టీ అట్రా సిటీ కేసును తన భార్య స్వాతీ, తన బావ మరిది సంతోష్ లతో అక్రమంగా పెట్టింటారని తెలిపారు. వాటర్ ప్లాంట్ కోసం 500 గజాల ప్రభుత్వ గెడ్డను మధు ఆక్రమించారని తహశీల్దారు 6ఎ నోటీస్ ఇచ్చినా ఇప్పటివరకూ ఎటువంటి చర్యలూ లేవన్నారు. వాటర్ ప్లాంట్ అక్రమమని జున్ 6న మున్సిపల్ అధికారులు సీజ్ చేస్తే, తాళాలు బద్దలు గొట్టి అదే రోజునుండి అక్రమంగా వాటర్ ప్లాంట్ నడుపుతున్నట్లు ధ్రువీకరించిన అధికారులు ఏడు నెలలైనా నేటికీ సీజ్ చెయ్యకుండా తాత్సారం చేయడం సరైనది కాదన్నారు. కావున తక్షణమే అక్రమ వాటర్ ప్లాంట్ సీజ్ చేసి, యజమాని పూసర్ల మధు సూధన రావు ను తక్షమే అరెస్టు చేయాలని కోరుతూ ఈనెల 11 నుంచి ఆందోళనా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. 11న గాంధీ విగ్రహం వద్ద నిరసన, 12, 13న సచివాలయాల్లో వినతులు 26 ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని, ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు కంది త్రినాథ్, రంబ శ్రీను వాసరావు,సుదీర్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పిపిఎస్ఎస్ నాయకులు

నేడు గంగాప్రసాద్ సంస్మరణ సభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మువ్వల గంగా ప్రసాదరావు సంతాప సభ సోమవారం నాలుగో తరగతి ఉద్యోగుల అసోసియేషన్ భవనంలో జరగుతుందని రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.శ్రీనివాస్, కోశాధికారి పి.రామలక్ష్మి తెలిపారు. సంఘం అభివద్ధికి ఎంతో కృషి చేసిన మువ్వల గంగా ప్రసాదరావు ఈనెల 1న అనారోగ్యంతో మృతి చెందారని తెలిపారు. ఆయనకు నివాళులర్పించేందుకు అందరూ రావాలని కోరారు.

19న గ్రామీణ వైద్యుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈనెల 19న గ్రామీణ వైద్యులు ఆత్మీయ కలయిక డి-మార్టు ఎదురుగా గల సర్వరాయ విహార్‌లో జరగుతుందని ఆ సంఘంజిల్లా అధ్యక్షులు గెద్ద చిరంజీవి తెలిపారు. ఆదివారం స్థానిక పిఎస్‌ఆర్ కాంప్లెక్స్ గ్రామీణ వైద్యుల సంఘం కార్యాలయంలో కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మీయ కలయిక లో జిల్లాలో సామాజిక సేవా కార్యక్రమాలు చేసిన వారిని గుర్తించి పురస్కారాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జోనల్ గౌరవ అధ్యక్షులు మమ్ముల తిరుపతిరావు, జిల్లా కార్యదర్శి కోట్ల పైడిరాజు, కోశాధికారి ఉమా శంకర్, సహాయ కార్యదర్శి మక్కువ రమణ, ఉపాధ్యక్షులు రామ్మూర్తి రాజు సమాచార కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.


క్రీడా కారులను ప్రోత్సహించేందుకే 'ఆడుదాం ఆంధ్ర'

- 15 నుంచి క్రీడా పోటీలు
- లక్షకు చేరుకున్న రిజిస్ట్రేషన్లు
- విజేతలకు నగదు బహుమతులు
- 'ప్రజాశక్తి'తో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఎం.అచ్యుతకుమార్

గ్రామీణ స్థాయిలో ప్రతిభ కలిగిన క్రీడా కారులను గుర్తించి వారిని ప్రోత్సహించేందుకు రాష్ట ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర పేరుతో క్రీడా పోటీలు నిర్వహిస్తోందని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎం.అచ్యుతకుమార్ తెలిపారు. 45 రోజులు పాటు పండగ వాతావరణంలో పోటీలు ఐదు క్రీడా అంశాల్లో నిర్వహిస్తామని చెప్పారు. ఇందుకు తగిన ఏర్పాట్లు సిద్దం చేశామన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముకి ఇంటర్వ్యూలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల నిర్వహణపై వివరించారు.

- ప్రజాశక్తి, విజయనగరంటౌన్





ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ఎప్పటి నుంచి ప్రారంభమవుతుంది?

ఈనెల 15 నుంచి ఫిబ్రవరి 2 తేదీవరకు 45 రోజులు పాటు ఆడుదాం ఆంధ్రా పేరిట క్రీడా పోటీలు జరగనున్నాయి. సచివాలయాల పరిధి, మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయిలో పోటీలు జరగనున్నాయి. క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

ఎన్ని క్రీడాంశాల్లో పోటీలు జరగనున్నాయి?

ప్రధానంగా ఐదు క్రీడాంశాల్లో పోటీలు జరగనున్నాయి. వాటిలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్ ఉన్నాయి. జిల్లా స్థాయిలో నాలుగు దశల్లో జరిగే పోటీల్లో సుమారు లక్ష మందికి పైగా క్రీడాకారులు పాల్గొనేలా విస్తత ప్రచారం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆదివారం నాటికి 98 వేలకు దగ్గరగా ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ల జరిగాయి. 13వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ కోసం సమయం ఉండటంతో లక్షకు పైగా రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరగనుంది.

పోటీల నిర్వహణకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందా?. వాటిని ఎలా కేటాయించనున్నారు?,

పోటీలకు ముందుగా జిల్లాకు లక్షన్నర నిధులు విడుదలయ్యాయి. వీటితో ముందుగా సచివాలయ స్థాయిలో విస్తతంగా ప్రచారం నిర్వహించేందుకు ఖర్చు చేసాం. అన్ని సచివాలయాల్లో వాల్‌పోస్టర్ల ద్వారా ప్రచారం, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి విస్తతంగా ప్రచారం నిర్వహించాం. విజేతలకు చెక్‌ల ద్వారా ప్రైజ్ మనీ ఇస్తాం.

ఆడుదాం ఆంధ్రా పోటీల్లో ఏ వయసు వారు పాల్గొనవచ్చు? విజేతలకు బహుమతులు ఇవ్వనున్నారా?.

ఈ పోటీల్లో పాల్గొనేందుకు 15 ఏళ్లు దాటిన వారు అర్హులు. సచివాలయ పరిధిలో ఆడే క్రీడాకారులకు క్రీడా కిట్లు ఇవ్వనున్నాం. నియోజకవర్గ, జిల్లా స్థాయిలో పోటీలకు బహుమతులు ప్రదానం చేయనున్నాం. మొదటి స్థానంలో నిలిచిన జట్టుకు రూ.35 వేలు, ద్వితీయ, తృతీయ స్థానాలకు రూ.15వేలు, రూ.10వేలు నగదు బహుమతులు ఇవ్వనున్నాం. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లను విశాఖపట్నంలో రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించనున్నాం. జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లుకు నగదు బహుమతి, మెడల్స్, సర్టిఫికేట్‌లు అందజేస్తాం.

క్రీడా కిట్లు సరఫరా జరిగిందా,ఎన్ని క్రీడలకు కిట్లు సరఫరా చేయనున్నారు?

ఐదు క్రీడలకు సంబంధించి గ్రామ సచివాలయం పరిధిలో సరఫరా చేసేందుకు కావాల్సిన కిట్లు వచ్చాయి. జిల్లాలోని అన్ని మండలాల్లో ఇప్పటికే కిట్లు పంపిణీ జరిగింది. సుమారు కోటి రూపాయల విలువ చేసే క్రీడా సామగ్రి పంపిణీ జరుగుతోంది.

ఇండోర్ స్టేడియంలో జిమ్ వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు ఏమైనా చేపట్టారా?.

ఇండోర్ స్టేడియంలో ఉన్న జిమ్‌ను మరో పది రోజుల్లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఎసిలు, కొత్త ట్రెడ్‌మిల్ కొనుగోలు చేశాం. రాజీవ్ క్రీడా ప్రాంగణంలో పాడైన జిమ్‌ను స్థానికులు కొంతమంది స్వచ్ఛందంగా బాగుచేశారు.

జిల్లాలో క్రీడల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలేమిటి?.

ప్రధానంగా జిల్లా కేంద్రంలో రాజీవ్ క్రీడా ప్రాంగణం, విజ్జి మైదానానికి నిత్యం వందలా మంది క్రీడాకారులు వస్తున్నారు. వీటిలో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నాం. త్వరలోనే విజ్జి స్టేడియంలో ఆరు కోట్లతో నిర్మించిన ఇండోర్ స్టేడియం వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. రాజీవ్ క్రీడా స్టేడియం మరమ్మతులు చేపట్టాం.కొండవెలగాడలో ఉన్న క్రీడా ప్రాంగణానికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తెస్తాం. రాజీవ్ మైదానంలో ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి సహకారంతో వాటర్ ప్లాంటు ఏర్పాటు చేశాం.

డిఎస్ఎ ఇండోర్ స్టేడియం ఆధునీకరణ పనులు ఏమైనా చేస్తున్నారా?.


డిఎస్ఎ ఇండోర్ స్టేడియం ఆధునీకరణ పనులు సుమారుగా 25 లక్షలతో చేపట్టాం. పనులు జరుగుతున్నాయి. త్వరలో పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తాం. నగర పాలక సంస్థ సహకారంతో ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి.

క్రీడా వికాస కేంద్రాలు అమలు ఎంత వరకు వచ్చింది?

నియోజకవర్గానికి ఒక క్రీడా వికాస కేంద్రం ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాం. గరివిడిలో ఏర్పాటు చేసిన క్రీడా వికాస కేంద్రం త్వరలో ప్రారంభించేందుకు సిద్ధం చేశాం. మిగిలిన నియోజకవర్గాల్లో క్రీడా వికాస కేంద్రాల పనులు 50 శాతం నుంచి 60 శాతం వరకు జరిగి నిలిచిపోయాయి.

జిల్లాలో క్రీడా మైదానాల అభివృద్ధికి, ఇండోర్ స్టేడియాలు వినియోగంలోకి తీసుకొచ్చేందుకు తీసుకుంటున్న చర్యలు?

జిల్లా కేంద్రంలో నెహ్రూ పార్కు ఎదురుగా ఉన్న డిఎస్ఎ స్టేడియానికి మరమ్మతులు జరుగు తున్నాయి. సివిల్ వర్క్స్ వారం రోజుల్లో పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకొస్తు న్నాం. విజ్జీ స్టేడియంలో ఉన్న ఇండోర్ స్టేడియం కాంట్రాక్టర్‌కు డబ్బులు చెల్లించాల్సి ఉంది. కొద్ది రోజుల క్రితమే కోటి 15 లక్షలు ప్రభుత్వం విడుదల చేసింది.



బయటి చదువుతున్న విద్యార్థులు

పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

ప్రజాశక్తి - బాడంగి

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం దత్తి సత్యనారాయణ ఆధ్వర్యంలో శతశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాల సమయానికి ముందు ఒకగంట, పాఠశాల సమయం ముగిసిన తరువాత ఒకగంట, పబ్లిక్ సెలవుల్లో కూడా రోజుకొక సబ్జెక్టు ఉపాధ్యాయులచే పాఠశాలలో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. వీటిని విద్యార్థులందరూ సక్రమంగా వినియోగించుకొని శత శాతం ఉత్తీర్ణత సాధించటంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు కూడా సహకరించాలని, విద్యార్థుకు మంచి పౌష్టికాహారాన్ని అందిస్తూ ఆరోగ్యంగా ఉండేటట్లు చూసుకొని తెల్లవారు జామున 4 గంటలకు నుండి, రాత్రి10 వరకు చదివించటంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్‌ఎం దత్తి సత్యనారాయణ కోరుతున్నారు.

ప్రభుత్వ మేలును ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి- బొబ్బిలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

ప్రభుత్వం చేసిన మేలును ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్క సోషల్ మీడియా సైనికుడిపై ఉందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ సోషల్ మీడియా ప్రతినిధుల ఆత్మీయా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం చేసే సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ తెలుగుదేశం పార్టీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరులు శంబంగి వేణుగోపాలనాయుడు, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, జిల్లా జేసిఎస్ కన్వీనర్ శంబంగి శ్రీకాంత్, జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, మండల జేసిఎస్ కన్వీనర్ తమ్మిరెడ్డి దామోదర్, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్, కో - కన్వీనర్లు, సచివాలయ సోషల్ మీడియా కన్వీనర్లు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం కోసమే పథకాలు

ప్రజాశక్తి- వేపాడ

బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసమే కేంద్ర ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందని వీటిని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని నీలకంఠరాజపురం సర్పంచ్ గొటివాడ దేవి కోరారు. ఆదివారం సాయంత్రం స్థానిక సచివాలయం ఆవరణలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను డిజిటల్ దృశ్యాల ద్వారా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మన సంకల్పం అభివృద్ధి చెందిన భారత్ అనే పుస్తకాలను, 2024 సంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయం కార్యదర్శి అప్పలనాయుడు, సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు, గ్యాస్ ఏజెన్సీ డీలర్ జోగారావు, వాలంటీర్లు పాల్గొన్నారు.

కొండదాడిలో శివపార్వతుల కల్యాణం

ప్రజాశక్తి- గరివిడి

మండలంలోని ఆదివారం కొండదాడి గ్రామంలో శివ పార్వతుల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సుమారు 2000 మందికి కార్తీక వన సమారాధన చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కిమిడి నాగార్జున పాల్గొని మాట్లాడారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు వల్ల శాంతియుత వాతావరణం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పైల బలరాం, సారేపాక సురేష్ బాబు, ముల్లు రమణ,పి సాయి రాజు, శంబాన సూర్యనారాయణ, గొట్టిముక్కల సత్తిరాజు, కుమరాపు రమణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - వంగర

మండలంలోని కొప్పరవలస గ్రామంలోని శ్రీసత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో అదే గ్రామానికి చెందిన పేదలకు బియ్యం, కందిపప్పు, వంటనూనె, బంగాళదుంపలు, కారం, పసుపు, ఉప్పు తదితర నిత్యవసర సరుకులు ఉచితంగా ఆదివారం పంపిణీ చేశారు. ప్రతి నెల 10వ తేదీన కొంతమంది పేదలకు నెలకు సరిపడిన సరుకులు పంపిణీ చేస్తున్నట్లు శ్రీ సత్య సాయి సేవా సమితి సభ్యులు సొంగ రాంబాబు, తూముల యోగేంద్ర, పెంకి ధనుంజయ తెలిపారు.

యువగళం ముగింపు సభకు నేడు భూమిపూజ

ప్రజాశక్తి - భోగాపురం

నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ముగింపు సభను పోలిపల్లి వద్ద నిర్వహిస్తున్నట్లు నెల్లిమర్ల నియోజకవర్గం ఇంచార్జ్ కర్రోతు బంగార్రాజు తెలిపారు. ఈనెల 19 లేదా 20వ తేదీన నారా లోకేష్ చేరుకునే అవకాశం ఉందని అన్నారు. ఈ ముగింపు సభకు సంబంధించిన భూమి పూజను సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ భూమి పూజలో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు పెద్ద ఎత్తున హాజరుకానున్నారని చెప్పారు.

22న మొయిదలో బహుజన రాజ్యాధికార సభ

భోగాపురం : ఆంధ్రప్రదేశ్ బహుజన సమాజ్ పార్టీ తలపెట్టిన బహుజన రాజ్యాధికార బహిరంగ సభ నెల్లిమర్ల మండలం మొయిదలో నిర్వహిస్తున్నట్లు ఆదివారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ నెల 22వ తేదీన జరిగే ఈ సభకు తరలి రావాలంటూ బహుజన సమాజ్ పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గ అధ్యక్షులు ఎరుకొండ వెంకటరావు పిలుపునిచ్చారు. ఈ సభకు ముఖ్య అతిధులుగా బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు బక్కా పరం జ్యోతి హాజరు కానున్నారని తెలిపారు. ఆయన తోపాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాడేరు మాజీ ఎమ్మెల్యే లకే రాజారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సోము రాంబాబు, జిల్లా అధ్యక్షులు కొమ్ము సోములు, రాష్ట్రనాయుకులు హాజరు కానున్నారని తెలిపారు. అనంతరం సభకు సంబంధించిన కరపత్రాలను రావాడలో బహుజన మహిళలు చేతులు మీదుగా విడుదల విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన నాయకులు చందాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ముఖ్య అతిథులు

కృత్రిమ అవయవాలు పంపిణీ

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని మంగళపాలెంలోని శ్రీగురుదేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం వికలాంగులకు కృత్రిమ అవయవాలు, దుప్పట్లను పంపిణీ చేశారు. ఫార్మర్ సెంట్రల్ విజిలన్స్ కమీషనర్ కెవి. చౌదరి, వైజాగ్ ప్రొఫైల్ గ్రూప్ సిఎండి బి. సురేష్ కుమార్, అరు ముగం, ఆనంద్ క్రిష్ణ పాల్గొని పంపిణీ చేశారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తున్న చారిటబుల్ ట్రస్ట్ అండ్ హాస్పిటల్ చైర్మన్ రాపర్తి జగదీశ్ కుమార్‌కు అభినందనలు తెలిపారు. అనంతరం 50 మంది వికలాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలు, వీల్ చైర్స్, ట్రై సైకిల్స్, చెవిటి మిషన్‌లు, 700 మందికి పైగా దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గురుదేవ హాస్పిటల్ వైస్ చైర్మన్ డాక్టర్ పణింద్ర, హాస్పిటల్ సిఇఒ డాక్టర్ అచ్చుతా రామయ్య, ట్రస్ట్, హాస్పిటల్ బృందం తదితరులు పాల్గొన్నారు.

కానరాని సర్వేలు

- తుపాను నష్టం అంచనా వేయడంలో నిర్లక్ష్యం
- క్షేత్ర స్థాయికి వెళ్లని అధికారులు
- ఇంకా పొలాల్లోనే వరి కుప్పలు
- పరిహారం కోసం ఆశగా ఎదురుచూస్తున్న రైతులు

మిచౌంగ్ తుపాను వల్ల కలిగిన పంట నష్టాన్ని అంచనా వేయడంలో వ్యవసాయశాఖ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. తుపాను తీరం దాటి ఐదు రోజులు కావస్తున్నా ఇంత వరకు క్షేత్రస్థాయిలోకి వెళ్లి పంట నష్టాలను అంచనా వేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి తుపాను సమయంలో పంట నష్టం వేస్తేనే నష్టం తీవ్రత కనిపించే పరిస్థితి ఉంది. కానీ అధికారులు ఐదు రోజులు దాటిన ఇంకా పొలాల్లోకి దిగకపోవడంతో సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. పంట నష్టాన్ని అంచనా వేయడానికి కూడా ముహూర్తం చూస్తున్నట్లు తెలిస్తోంది. పంట పోయి దుఃఖంలో ఉన్న రైతులను ఓదార్చడానికైనా పొలంలోకి వస్తారేమోనని ఆశగా చూస్తున్న రైతుకు నిరాశే మిగులుతోంది. పైగా ప్రభుత్వం కూడా పంట నష్ట పరిహారాన్ని ప్రకటించకుండా దోబూచులాడుతుండటం రైతును మరింత ఆగ్రహానికి గురి చేస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే అధికారులను క్షేత్ర స్థాయి పరిశీలనకు పంపించాలని, తమను ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఇటీవల మిచౌంగ్ తుపాను దాటికి మండలంలో 490 ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు రైతులు అంచనా వేస్తున్నారు. ఇంత వరకు రైతు వారీగా ఎంత పంట నష్టం జరిగిందనేది లెక్కలు తేల్చలేదు. దీంతో ఆయా రైతులు ఏమీ చేయలేని స్థితిలో కొట్టు మిట్టాడుతున్నారు. సతివాడలో 20 ఎకరాల్లో పత్తి పంట నష్టం జరిగిందని గుర్తించారు. కాగా అధికారులు, ప్రజాప్రతినిధులు హడావిడిగా వచ్చి తడిసిన పంటలను పరిశీలించినా రైతులను ఆదుకొనే పరిస్థితి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిపోయిన వరిపంటను రక్షించు కోవడానికి పొలాల్లోకి వెళ్లి ఆరబెట్టుకోవడం తప్ప తమను ఆదుకొనే నాధుడు లేడని వాపోతున్నారు. ఆరుగాలం కష్టపడి విత్తనాల పోత నుంచి పంట కోత వరకు పెట్టుబడికి వెనక్కు తగ్గకుండా వరి సాగు చేస్తే వర్షాలు కురవక ఎన్నో ఇబ్బందులు పడి పొట్ట దశలో ఉన్న పంటను యంత్రాలతో నీరందించి చివరి కోత కోసే సమయంలో తుపాను కారణంగా అకాల వర్షాలు కురిసి చేతికి అంది వస్తుందనుకున్న వరి పంట నీట మునిగి తిండి గింజలు కూడా దక్కకుండా పోయిందని చెబుతున్నారు. ప్రభుత్వం ఆదుకుంటుందని ఆశగా ఎదురు చూస్తున్న రైతుకి తుపాను పోయి వారం రోజులు గడుస్తున్నా ఇప్పటికీ రైతు వారీగా పంట నష్టం గుర్తించకపోవడం దారుణమని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి పంట నష్టం గుర్తించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



నెల్లిమర్ల: ఇంకా నీటిలోనే ఉన్న వరి కుప్పలు

పొలంలోని పంట కల్లాలకు తరలింపు..

వేపాడ: ఇటీవల కురిసిన వర్షాలు వల్ల పొలాల్లో కుప్పలుగా పెట్టిన వరి, కోసి ఉంచిన వరి పూర్తిగా తడిచిపోయిన విషయం తెలిసిందే. గత రెండు రోజులుగా కాస్త ఎండలు కాయడంతో తడిచిన వరిని చాలా మంది రైతులు ఆరబెట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. మరి కొంత మంది ఆరబెట్టిన వరిని కళ్లాలకు తరలించుకునేందుకు తంటాలు పడుతున్నారు. వరిని కళ్లాలకు తరలించాలంటు పొలంలోకి దిగాల్సి వస్తుంది అలా దిగిలాంటే ఇప్పటికే నానిపోయి పొలం దిగబడి పోతుంది. దీంతో ఏదోలా పొలంలో దిగిన రైతు రోడ్డు వరకూ తలపై పెట్టి మోసుకుని వచ్చి రోడ్డుపై ట్రాక్టర్‌కు అందిస్తున్నారు. దీంతో రైతుకు ఖర్చు తడిసిమోపెడవుతోంది. మరి కొంతమంది నీటిలో మునిగి ఉన్న వరి కుప్పలను ఒడ్డుకు చేర్చలేక, చేతికి అందిన పంటను వదులుకోలేక మల్లగుల్లాలు పడుతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి చేతికందే సమయానికి వర్షాలు పడటంతో అప్పులు పాలవుతున్నామని రైతులు వాపోతున్నారు. ఆదివారం మండలంలోని వల్లంపూడి తదితర గ్రామాల్లో వరిని మోపులు కట్టి రోడ్డుకు చేర్చి అక్కడి నుంచి ట్రాక్టర్ల ద్వారా కళ్లాలకు చేరిస్తూ రైతులు కనిపించారు.

ఐదు రోజులు కావస్తున్నా సర్వే లేదు : సిపిఎం

శృంగవరపుకోట: తుపాను తీరం దాటి ఐదు రోజులు కావస్తున్నా పంట నష్టాన్ని పరిశీలించి నష్టపోయిన రైతుల జాబితాను సర్వే చేసి రూపొందించే జాడలు ఎక్కడ కానా రావటం లేదని సిపిఎం మండల కార్యదర్శి మద్దిల రమణ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని సుమారు 2,500 ఎకరాల్లో తుపాను కారణంగా వరి పంట దెబ్బతిందని వెంకటరమణ పేట, తిమిడి, వసి, కొత్తూరు పెదకండేపల్లి మొదలగు చోట్ల ధాన్యం మొలకలు వచ్చాయని, మొలకలు వచ్చిన ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించలేదని చెప్పారు. ఇప్పటి వరకు ప్రభుత్వం కాలయాపన చేస్తుంది తప్ప రైతులకు ఎక్కడా ఆదుకున్న దాఖలాలు లేవని ఆయన విమర్శించారు. పంట నష్టాన్ని సర్వే చేసి రైతులను గుర్తించి వెంటనే వారికి నష్టపరిహారాన్ని చెల్లించాలని మొలకెత్తిన ధాన్యానికి మద్దతు ధర ప్రకటించి రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నామని లేని పక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతామని ఆయన హెచ్చరించారు.

నష్టపరిహారం ప్రకటించాలి

గజపతినగరం: తుపాను వల్ల రైతులు తీవ్రంగా పంటలను నష్టపోయారని వెంటనే వారికి నష్టపరిహారం చెల్లించాలని ఎపి రైతు సంఘం మండల కన్వీనర్ దాసరి సింహాద్రి, ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏ పొలంలో చూసినా వరి ముంపునకు గురై కనిపించిందని, వర్షాలు తగ్గినా కుప్పలు కింద తడి ఆరకపోవడంతో మొలకలు వచ్చేశాయని రెవెన్యూ, వ్యవసాయ శాఖలు సంయుక్తంగా సర్వే చేసి పంట నష్టాన్ని గుర్తించి రైతుకు న్యాయం చేయాలని కోరారు. పంట చేతికి వచ్చే సమయంలో నష్టపోయారు కాబట్టి ఎకరాకు రూ. 50వేలు పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ధాన్యం కళాసీల ఛార్జీలను పూర్తి స్థాయిలో విడుదల చేయాలని కోరారు.



వేపాడ: కళ్లాలకు వరి చేలును మోస్తున్న కూలీలు

హక్కుల పరిరక్షణతోనే మానవ వికాసం

ప్రజాశక్తి- బొబ్బిలి

మానవ హక్కుల పరిరక్షణతోనే మానవ వికాసం చైతన్యం అవుతుందని బొబ్బిలి రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు అన్నారు. ఆదివారం స్థానిక ట్రిబుల్ ఎస్ డిగ్రీ కాలేజీలో అంతర్జాతీయ మానవ హక్కుల సంక్షేమ సంఘం విజయనగరం జిల్లా చైర్మన్ భవిరెడ్డి శంకరరావు ఆధ్వర్యంలో మానవ హక్కుల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అధితిగా పాల్గొన్న జెసి రాజు మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణ కోసం ఈ సంవత్సరాన్ని ఐక్య రాజ్యసమితి అందరికి స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం అందేలా ప్రపంచ దేశాల ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చిందన్నారు. ప్రస్తుతం మానవ హక్కులపై దాడిజరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వాటిని పరిరక్షించుకోవటం కోసం, కోల్పోతున్న హక్కులను పునరుద్ధరణ కోసం పోరాటాలు చేయాల్సిన పరిస్థితులు వచ్చాయన్నారు. మానవ హక్కులకు పోలీస్ స్టేషన్‌లోనే అత్యధిక ముప్పు ఏర్పడుతుందన్న సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వి. రమణ మాటలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. జిల్లా చైల్డ్ రైట్స్ ఫోరమ్ చైర్మన్ పి. చిట్టిబాబు మాట్లాడుతూ గౌరవ ప్రథమైన జీవనానికి మానవ హక్కులు అవసరమని అన్నారు. జీవించే హక్కు, కుటుంబాన్ని కలిగి ఉండే హక్కు, న్యాయాన్ని పొందే హక్కు, ప్రైవసీని కలిగి ఉండే హక్కు, స్వేచ్ఛ హక్కు, పని హక్కు, విద్యా హక్కు మొదలైన మానవ హక్కులని, ఇవి ఎలాంటి బేధాలు లేకుండా అందరికీ వర్తిస్తాయని అన్నారు. పౌరుల గౌరవ ప్రథమైన జీవనానికి, స్వేచ్ఛకు, సమానత్వానికి, వారి హక్కులను రక్షించటం ప్రభుత్వాల కర్తవ్యమని అన్నారు. తర తమ భేదాలు లేకుండా ప్రజలందరి హక్కులను కాపాడటం రాజ్యాంగ బద్ధమైన విధిగా ప్రభుత్వాలు గుర్తించాలన్నారు. ప్రతి ఒక్కరూ మానవ హక్కులపై అవగాహన కలిగి ప్రశాంత మైన జీవనాన్ని కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జ్యూడిషియల్ ఉద్యోగుల సమాఖ్య ప్రతినిధి సూర్య చంద్రరావు, మానవ హక్కుల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రామాంజనేయ మూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ అధ్యక్షులు జె సి రాజు



మాట్లాడుతున్న జెసి రాజు

అపరాలకూ తీవ్ర నష్టం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో మిచౌంగ్ తుపాను కారణంగా రైతులు వరి పంటతో పాటు అపరాల పంటలను నష్టపోయారు. వరి కోసే ముందు పొలంలో చాలా మంది రైతులు పెసర, మినుప పంటలను వేశారు. మూడు రోజులుగా ఏకధాటిగా పడిన వర్షాలు కారణంగా నీరు పొలంలో నిల్వ ఉండడంతో పెసర, మినప విత్తనాలు ఉబ్బిపోయి పనికిరాకుండా పోయినట్లు రైతులు చెబుతున్నారు. ఈ విషయంపై ఎఒ యశ్వంత్ కుమార్‌ను వివరణ కోరగా ఇప్పటికే పెసర నాటి ఉంటే వర్షాలకు పూర్తిగా నీటమునిగిపోయి ఉంటాయని ఐదు రోజులు దాటితే తప్ప అవి బతుకుతాయో లేదో చెప్పలేమని స్పష్టం చేశారు. ఈ పంటలు సుమారు 6 హెక్టార్లులో నష్టం జరిగే అవకాశం ఉంటుందని ఆయన అంచనా వేశారు.



నీటిలో మునిగి మొలకెత్తని విత్తనం (ఇన్‌సెట్‌లో)

ప్రభుత్వ స్థలాల కబ్జాలపై చర్యలేవి?

ప్రజాశక్తి- బొబ్బిలి



మాట్లాడుతున్న శంకరరావు

ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి అమ్మకాలు చేసుకుంటున్న వారిపై చర్యలేవని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకరరావు ప్రశ్నించారు. కార్మికులు విశ్రాంతి స్థలం కోసం పార్కు చెరువు గట్టుపై స్థలం అడిగి పునాదులు వేస్తే పోలీసులతో తొలగించిన అధికారులు ఇప్పుడు అధికార పార్టీకి చెందిన వారు ప్రభుత్వ స్థలాలు కబ్జా చేస్తుంటే కనిపించడం లేదా అని ప్రశ్నించారు. స్థానిక వేణుగోపాల స్వామి ఆలయం వద్ద మున్సిపల్ కార్మికులతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొబ్బిలి పట్టణంలో అధికార పార్టీ నాయకులు స్థలాలు ఆక్రమించుకొని లక్షల రూపాయలకి అమ్ముకుంటున్నా న్నారు. కమిషనర్‌కు, చైర్మన్‌కు కార్మికులకు స్థలం కేటాయించాలని అనేక సార్లు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ నేటికి స్థలం ఇవ్వలేదన్నారు. ఈ నేపథ్యంలో మనమందరం కలిసి రాబోయే కౌన్సిల్ మీటింగ్‌లో అమీతుమీ తేల్చుకోవడానికి అవసరమైతే కౌన్సిల్ అడ్డుకోవడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్మికులందరూ సమ్మెకు సైతం వెనుకాడకుండా ముందుకు రావాలన్నారు. ఈ సమావేశంలో యూనియన్ అధ్యక్షులు జి. గౌరేష్, కార్యదర్శి జె. రామారావు, యుగంధర్, జి. శంకర్రావు, కార్మికులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి జనసేన అండ

ప్రజాశక్తి - కొత్తవలస

ఇటీవల కొత్తవలసలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన కంటకాపల్లి గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త కుటుంబానికి పార్టీ అండగా నిలిచి రూ.5 లక్షలు బీమా డబ్బులు అందించారు. కంటకాపల్లి గ్రామానికి చెందిన సేనాపతి గణేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. క్రియాశీలక జనసైనికులందరికీ పార్టీ అధిష్టానం బీమా చేయించింది. ఈ నేపథ్యంలో గణేష్ కుటుంబానికి పార్టీ పిఎసి సభ్యులు నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా బీమా చెక్ అందించారు. వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త వబ్బిన సత్యనారాయణ, కొత్తవలస మండల అధ్యక్షుడు గొరపల్లి రవికుమార్, మండల ఉపాధ్యక్షులు బోగాది దేవా, అలమండ సురేష్, జిల్లా ప్రచార కమిటీ సభ్యులు మల్లువలస శ్రీను, నాయకులు పిల్లా రామదుర్గ, బోని రామ గణేష్, గొరపల్లి పోలినాయుడు, ఉగ్గిన చిన్నారావు, కోట్ని గోవింద్, ఉంగరం రాజు పాల్గొన్నారు.



చెక్కును అందిస్తున్న మనోహర్

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎస్‌కోట: విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - వంగర

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం ముద్దాడ రమణమ్మ, పీడీ బి. కవిత గురువారం తెలిపారు. గత నెల 23, 24, 25 తేదీలలో పల్నాడు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ పోటీలలో లాంగ్ జంప్ విభాగంలో దేవకివాడ అశోక్ ప్రథమ స్థానం, 400 మీటర్ల రిలే విభాగంలో కొమరావు చందు కూడా ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని ఈ నెల 16, 17, 18, 19 తేదీలలో లక్నోలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.

జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ

నెల్లిమర్ల: జిల్లా స్థాయి పద్య పఠన పోటీల్లో అలుగోలు జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎం.హర్ష వర్ధన్, బి.భార్గవి ప్రతిభ కనబర్చారు. జిల్లా స్థాయి స్థాయి పద్య పఠన సీనియర్, జూనియర్ విభాగంలో పాల్గొని ప్రతిభ కనబర్చి ప్రోత్సాహక బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా వారిని గురువారం పాఠశాలలో హెచ్‌ఎం జి.ఎస్. కాంతారావు, ఉపాధ్యాయులు జి.భవాని, దమయంతి, సంగం నాయుడు అభినందించారు.

జాతీయస్థాయి సైన్స్ కాంగ్రెస్‌కు ప్రాజెక్టు ఎంపి

శృంగవరపు కోట: జాతీయ స్థాయి 31వ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలకు మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు బోజంకి భరత్, బొబ్బిలి గాయత్రి రూపొందించిన టిసిఎస్ – టీ కాఫీ శాండ్ ప్రాజెక్టు ఎంపికైంది. గుంటూరులోని కే.ఎల్ యూనివర్సిటీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలలో 187 ప్రాజెక్టులు ప్రదర్శించగా భరత్ రూపొందించిన టీ కాఫీ శాండ్ జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. మహేశ్వరరావు తెలిపారు. గైడ్ టీచరుగా పొట్నూరు శివాజీ వ్యవహరించారు. ఈ విద్యార్థిని ఆప్ కాస్ట్ మెంబర్ సెక్రటరీ అపర్ణ, ఎస్సీ ఇఆర్టి డైరెక్టర్ బి. ప్రతాపరెడ్డి డిఇఒ బి. లింగేశ్వర్ రెడ్డి, జిల్లా అకాడమిక్ కోఆర్డినేటర్ టి. రాజేష్, ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు శివరామకృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

చెరువుల్లా మారిన రహదారులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలో రహదార్లు చెరువులను తలపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రధాన రహదారి పక్కన ఉన్న కాలువ పూడుకు పోయి మురుగునీరు రహదారి మీద ప్రవహించి వాహన దార్లు, పదాచార్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. స్థానిక సిహెచ్‌సి వద్ద ప్రధాన కాలువ పూడుకుపోయి మురుగునీరు రహదారి మీద ప్రవహిస్తుంది, దీనికి మురుగు బయటకు పోయే అవకాశం లేదు. మొయిద జంక్షన్ నుంచి జరజాపుపేట వెళ్ళే రహదారిలో కల్వర్టు పూడుకుపోవడంతో అక్కడ కూడా మురుగు నీరు రోడ్డు మీద నిలిచిపోతుంది. దీనిపై స్థానికులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకు వెళ్ళినా రహదార్లు, భవనాల శాఖ చేయాలని చెప్పి తప్పించుకుంటున్నారే తప్ప సమస్య పరిష్కరించడం లేదని స్థానికులు వాపోతున్నారు. దీంతో బాటు నగర పంచాయతీలో పూర్వ కాలం నాటి సీసీ రోడ్లు, కాలువలు శిథిలావస్థకు చేరి స్థానికులు నడవలేని పరిస్థితిల్లో ఉన్నాయి. 10వ వార్డులో నాయుడు కాలనీ,9వ వార్డులో ఇందిరా కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు నీరు సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



పిహెచ్‌సి సమీపంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు



మొయిద జంక్షన్‌లో రోడ్డుపై చేరిన వరద నీరు